క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రి సందర్శన


ప్రభుత్వాసుపత్రిని పరిశీలిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. అక్కడి సైకియాట్రిక్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలు, రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే గౌతమి జీవకారుణ్య సంఘాన్ని సందర్శించారు. అక్కడ వృద్ధులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. వృద్ధులకు ఏవిధమైన సమస్యలున్నా పారాలీగల్ వలంటీర్ల ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆదినారాయణ మృతి తీరనిలోటు


ఆదినారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు రావిపాటి ఆదినారాయణ మృతి తీరనిలోటని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియపులంకలో ఆదినారాయణ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. ఆదినారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, డైరెక్టర్ వారరాము, పార్టీ నాయకులు ఆరేటి వెంకట్రావు, బోడపాటి సత్తిబాబు ఉన్నారు. అలాగే రావిపాటి కుటుంబాన్ని నర్సరీ రంగ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు.

దళిత యువకులను విడుదల చేయాలి

ప్రకాశం నగర్: పోలీసులు అరెస్ట్ చేసిన దళిత యువకులను విడుదల చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలం కోటపాడులోని ఉమ్మడి శ్మశానవాటికను అగ్రకులాలు ఆక్రమించుకుని గోడ కట్టారని ఆరోపించారు. ప్రశ్నించిన దళిత యువకులను అక్రమంగా అరెస్ట్ చేశారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు – గోదావరి రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల వ్యక్తి గుర్తుతెలియని మృతి చెందాడని జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు చొక్కా, నీలం జీన్స్ ప్యాంట్ ఉన్నాయన్నారు. కుడి చెయ్యి, ఛాతీ కుడివైపుపై పుట్టుమచ్చలు ఉన్నాయన్నారు.

మహాత్మాగాంధీకి నివాళి


సంహితలో గాంధీ చిత్రపటానికి నివాళి

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ శాంతి, అహింస ఆయుధాలుగా దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన గొప్పవ్యక్తి గాంధీజీ అన్నారు. కళాశాల జాతీయ సేవాపథకం యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో జి.బాలకృష్ణ, టి.శ్రీనివాస్, వల్లి సురేష్ పాల్గొన్నారు.

కడియం: వేమగిరిలోని బుద్ధవిహారాలో గాంధీ విగ్రహానికి సోమవారం పుష్పాంజలి ఘటించారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

రాజమహేంద్రవరం రూరల్: లక్ష్య సాధన కోసం విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రాజవోలు గ్రామంలోని ఏఎంజీఆర్ ఇంగ్లిషు మీడియం స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన 'ఎంపవర్డ్ టూ ఎంపవర్ ఎన్ ఇంట్రాక్టివ్ సెషన్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్ఫూర్తివంతమైన సందేశం ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఎంకే ప్రభుప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక శ్రీను పాల్గొన్నారు.

ఆక్సిజన్ సిటీగా రాజమహేంద్రవరం

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా హరిత – యువత
- నగరంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం
- పాల్గొన్న హోంమంత్రి తానేటి వనిత, హీరోయిన్ ఇషాచావ్లా


నందం గనిరాజు జంక్షన్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న హోంమంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్ రామ్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, హీరోయిన్ ఇషాచావ్లా

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పచ్చదనం పెంపొందించి ఆక్సిజన్ సిటీగా తయారు చేద్దామని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం నగరంలో యువత – హరిత (గోగ్రీన్ చాలెంజ్) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హోంమంత్రి తానేటి వనిత హాజరయ్యారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నగరంలో ఇప్పటికే పలు చోట్ల మొక్కలు నాటామన్నారు. మొక్క నాటడంతో పాటు చంటి బిడ్డ మాదిరిగా సంరక్షిస్తే అది మహావృక్షమై మానవాళి మనుగడకు దోహదపడుతుందన్నారు. నగరంలోనే పుట్టిన తనకు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు సీఎం జగన్ మంచి అవకాశం ఇచ్చారన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. వచ్చే ఏడాదికి నగరం రూపురేఖలు అద్భుతంగా మారిపోతాయని, సుందర హరిత నగరంగా అభివృద్ధి చెందనుందన్నారు.

స్ఫూర్తినిచ్చే కార్యక్రమం

సినీ నటి ఇషాచావ్లా మాట్లాడుతూ యువత – హరిత కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఒక మొక్క నాటానని, అది ఎంత ఎత్తుకు ఎదిగిందో చూసేందుకు వచ్చే సంవత్సరం రాజమహేంద్రవరం వస్తానన్నారు. నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకోవడం, నిత్యం బాటిళ్లతో నీరు తెచ్చి పోయడం బాగుందన్నారు. ఇదే విధానాన్ని అన్నిచోట్లా కొనసాగిస్తే మంచి ఫలితం వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ.5 లక్షల మంజూరు

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నగరానికి చెందిన టి.వెంకట రవికుమార్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన సీఎం సహాయనిధి చెక్కు రూ.5 లక్షలను ఎంపీ భరత్ రామ్ స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాధితుడికి అందజేశారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలేవి?

- ప్రశ్నించిన జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్
- కడియం మండల పరిషత్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మైనింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేగురుపాడు సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: మండల పరిధితో పాటు, రాజానగరం, మండపేట మండలాల సరిహద్దుల్లో ఉన్న భూముల్లో అక్రమంగా మైనింగ్ జరుగుతోందని, వాటిపై సంబంధిత అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని కడియం మండల పరిషత్ సంబంధిత అధికారులను నిలదీసింది. జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. అక్రమంగా గ్రావెల్ తదితర వాటిని తీసుకువెళుతున్న వాహనాలు పరిమితికి మించిన వేగంతో వెళుతున్నాయని, వీటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కానీ మైనింగ్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఎందుకు వీటిపై దృష్టి పెట్టడం లేదో అర్థం కావడం లేదన్నారు. కోస్టల్ పేపర్‌మిల్లు సమీపంలోనే భీమవరానికి చెందిన వారి భూమిలో రెండెకరాల విస్తీర్ణంలో దాదాపు యాభై అడుగుల లోతుతో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వేశారన్నారు. శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు వారు మొరపెట్టుకోగా, ఆయన ఆదేశాల మేరకు తాను స్వయంగా వెళ్లి చూసి, సంబంధిత అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లానన్నారు. అక్రమ తవ్వకందారులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటిక్కూడా సమాచారం లేదని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే భూమిలో తవ్వకాలు జరుగుతుంటే భూయజమానులు చేసిన ఫిర్యాదుకు కూడా అతీగతీ లేదన్నారు. అధికారులు ఇలా వ్యవహరిస్తుంటే ఎలా? అంటూ నిలదీశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కూడా ఈ విషయంతో ఏకీభవించారు.

వివిధ సమస్యలపై..

మండల పరిధిలో ఇప్పటి వరకు అక్రమ మైనింగ్‌దారులపై తీసుకున్న చర్యల వివరాలను సమావేశానికి తెలియజేయాలని సంబంధిత మైనింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో కొందరు విద్యార్థుల ప్రవర్తన గురించి పదేపదే ఫిర్యాదులు అందుతున్నాయన్న అంశం సమావేశం ముందుకు వచ్చింది. చిన్న వయసులో పక్కదారి పట్టిపోయే వారిని క్రమశిక్షణలో పెట్టాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులపై ఉందని సమావేశం పేర్కొంది. దీనిపై రాజకీయాలకు అతీతంగా గ్రామ పెద్దలతో కలిసి విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి కృషి చేసి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కడియంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసేందుకు అందరి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్టాలిన్ సమావేశాన్ని కోరారు. అనంతరం శాఖల వారీగా మండల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దార్ ఎం.సుజాత పాల్గొన్నారు. అంతకు ముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉత్తమ ఎంపీడీవోగా పురస్కారం అందుకున్న కె.రత్నకుమారిని ఘనంగా సత్కరించారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీ భరత్ రామ్
- 9వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం


కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. తన దృష్టికి తీసుకువచ్చే వరకూ వాటిని పరిష్కరించకపోవడంపై కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక 9వ డివిజన్ జేఎన్ రోడ్డు జేకే రెసిడెన్సీ వద్ద సోమవారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నిధులు మంజూరు చేయడంలో నిర్మిస్తున్న డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కొన్నిచోట్ల డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి దాసి వెంకట్రావు, కంచుమర్తి చంటి పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- మాధవరాయుడుపాలెంలో గడప గడపకూ


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని మాధవరాయుడుపాలెంలో సోమవారం మూడోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మూడున్నరేళ్లుగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉంటే లబ్ధిదారుడి ఇంటికే పథకాలను నేరుగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అలాగే స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు తెలిపిన వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, పార్టీ నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, రాజా హరిశ్చంద్ర, సాపిరెడ్డి సూరిబాబు, కొత్తపల్లి శివాజీ, అయిరెడ్డి అయ్యప్ప, ఎల్లే వీర్రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన


పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం సభ్యుడు

కంబాలచెరువు: విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన ప్రగతిని అంచనా వేసేందుకు విద్యాశాఖ అధికారుల ఆదేశానుసారం ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయి. ఇందులో భాగంగా స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాలలను సోమవారం ప్రత్యేక బృందం సందర్శించింది. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్ బుక్‌లను పరిశీలించింది. నివేదికను అర్బన్ రేంజ్ డీఐ కార్యాలయానికి అందజేస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు. నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి, ఉపాధ్యాయులు బృందం అడిగిన సమాచారాన్ని అందజేశారు.

గంజాయి కేసుల్లో ఏడుగురి అరెస్టు

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో ఏడుగురిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచామని సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపారు. కొంతమూరులో కేశవస్వామి ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయితో ఉన్న మసగిరి దుర్గారావు, ఏడిద సువర్ణరాజ్, యాదల చందులను అరెస్టు చేసి, వారి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నామన్నారు. అలాగే చక్రద్వారబంధం సమీపంలోని గణేష్ టౌన్‌షిప్‌లో గంజాయి అమ్ముతున్న దుళ్ల రాజ్ కుమార్, విశ్వాసపు గణేష్, వాసంశెట్టి రుద్రదుశ్య మల్లేష్, షేక్ నాగూర్‌ను ఎస్సై జుబేర్ అరెస్టు చేసి, నిందితుల నుంచి 20.5 కిలోల గంజాయిని పట్టుకున్నారన్నారు.

కారు అద్దెకు తీసుకుని...

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కారు అద్దెకు తీసుకుని వెళ్లి మూడు నెలలు అయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో పాటు ఫోన్‌కు స్పందించడం లేదని కాతేరుకు చెందిన సోము బుల్లెబ్బాయి సోమవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏవీ అప్పారావు రోడ్డుకు చెందిన సయ్యపు సత్యనారాయణరాజు తన దగ్గర కారును అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదన్నాడు.

జనార్దనుని కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన

- శాశ్వతంగా తీరిన విద్యుత్ లైన్ల సమస్య
- చర్యలు తీసుకున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా జరిగే రథోత్సవానికి విద్యుత్ లైన్లు ప్రధాన సమస్యగా ఉండేది. ప్రతి సంవత్సరం రథోత్సవం జరిగే సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసేవారు. సుమారు 200 సర్వీసు లైన్లను తొలగించి మళ్లీ యథాస్థానంలో పెట్టాల్సి వచ్చేది. దీని కోసం సుమారు 30 మంది విద్యుత్ సిబ్బంది గంటల తరబడి పనులు నిర్వహించేవారు. దీంతో పాటు రాత్రి వరకు విద్యుత్ సరఫరా ఉండేది కాదు. ఇటీవల స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్షించిన చందన నాగేశ్వర్ దృష్టికి సమస్యను గ్రామస్తులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఆ సమస్య శాశ్వత పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. దీంతో మూడు రోజులుగా విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శామ్యూల్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనుబాబు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. 12 కొత్త పోల్స్, 500 మీటర్ల ఎల్‌టీ లైన్ వేశారు. దీంతో ఉత్సవాల సమయంలో విద్యుత్ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభించింది. సమస్య పరిష్కారానికి కృషి చేసిన చందన నాగేశ్వర్, విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఉత్సవ ఏర్పాట్లను చందన నాగేశ్వర్ పరిశీలించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలమంది హాజరు కానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దేవులపల్లి సరితారాణి, షట్టర్ బాషా, తలారి వరప్రసాద్, రేగుళ్ల రఘు, బర్రి సుబ్బారావు, సత్యం వెంకటరమణ, చప్పిడి జ్యోతి, పుట్టా పరేష్‌నాథ్, మెండా రాజేష్, బోడపాటి కుమార్, పందెళ్ల భానుప్రసాద్, బొడ్డేటి శివాజీ, గూటం రాజు, వెలగల కల్యాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యం

- న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి
- పేపర్ మిల్లు కార్మికుల సత్కార సభలో ఎంపీ భరత్ రామ్


ఎంపీ భరత్ రామ్‌ను సత్కరిస్తున్న పేపరుమిల్లు కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ పేపర్ మిల్లు కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఏపీ పేపర్ మిల్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం ఏపీపీ మిల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీ భరత్ రామ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ కూడా చొరవ చూపాలని అప్పుడే ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగి లాభాల బాట పడుతుందన్నారు. కార్మికుల సమస్య అంటే మేనేజ్‌మెంట్ సమస్యగా భావించాలన్నారు. ఏ సంఘ కార్మికుడైనా తనకు ఒకటేనని, ఎవరైనా సమస్యలు చెప్పదలచుకుంటే నేరుగా తన కార్యాలయానికి రావచ్చునన్నారు. ఫ్యాక్టరీ సమర్థంగా నడవాలన్నా, కార్మికుల సంక్షేమానికైనా బలమైన కార్మిక సంఘం అధికారంలో ఉండాలన్నారు. బలమైన యూనియన్ ఏర్పాటు విషయంలో కూడా తాను బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పేపర్ మిల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిట్టూరి ప్రవీణ్ చౌదరి, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ యూనియన్ కార్యదర్శి ఈశ్వర్ నారాయణ్, సమైక్య కార్మిక సంఘం అధ్యక్షుడు బుద్దాల మురళి, కార్యదర్శి ఎస్.ప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు గిరజాల బాబు, పాలిక శ్రీను, సప్పా ఆదినారాయణ పాల్గొన్నారు.

తిరుపతి దేవస్థానానికి ఆర్గానిక్ బియ్యం


వినోద్‌కుమార్ రెడ్డి పంపించే బియ్యంతో గొందేశి శ్రీనివాసులురెడ్డి తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన సత్తి వినోద్ కుమార్ రెడ్డి తాను పండించిన మొదటి పంటను తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారి నైవేద్యానికి కానుకగా అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఎదురుగా గల వినోద్ కుమార్ రెడ్డి ఇంటిలో ఈ మేరకు కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ.2 లక్షల విలువైన 64 బస్తాల ఆర్గానిక్ బియ్యాన్ని టీటీడీకి అందించేందుకు రైలులో తిరుపతికి పంపించారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, సీపీ రెడ్డి హీరో మోటోకార్ప్ అధినేతలు చింతా ప్రసాద్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తేతలి రామచంద్రారెడ్డి, పడాల రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కడియం: 33/11కేవీ వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్, 11 కేవీ వేమగిరి ఏజీఎల్ ఫీడర్ల వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేమగిరిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కేటింగ్ విజేతలకు సత్కారం

ప్రకాశం నగర్: జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన కె.భవ్యశ్రీ, కోచ్ కె.రామును రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ విషయాన్ని కోచ్ రాము సోమవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన సుమారు 150 మందిని మెగ్రాజపురం సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సత్కరించారన్నారు.

అఖిలపక్షం నిరసన

ప్రకాశం నగర్: జీఓ నంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జాంపేట మహాత్మాగాంధీ విగ్రహం ముందు అఖిల పక్ష నాయకులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన పీఏసీ సభ్యుడు కందుల దుర్గేష్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం నాయకుడు ప్రకాష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమ రాజు, కాంగ్రెస్ నాయకుడు బాలేపల్లి మురళీ పాల్గొన్నారు.

గోవింద మాలధారణ


గోవింద మాల ధరించిన భక్తులు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం భక్తులు గోవింద మాల ధరించారు. ఏటా మాదిరిగానే బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి అందించే సేవల్లో వీరు పాలుపంచుకుంటారు. కాగా తెల్లవారు జామునే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో గోవింద దీక్షలను భక్తులు స్వీకరించారు. మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 8 గంటలకు శేషవాహన సేవ జరుగుతుందని ఆలయ భక్త బృందం తెలిపింది.

మర్యాదపూర్వక కలయిక


గోపాలకృష్ణ ద్వివేదికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుమాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదిని సోమవారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. ద్వివేది వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తానన్నారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, ఎస్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.